క్లుప్తంగా

విద్యార్థులకు సికిల్ సెల్ పరీక్షలు



గంగాడ ప్రాథమిక పాఠశాలలో పరీక్షలు చేస్తున్న వైద్యశాఖ సిబ్బంది

బలిజిపేట: పౌష్టికాహారం, రక్తం తక్కువ ఉన్న (సికిల్‌సెల్) వ్యాధికి సంబంధించి విద్యార్థులకు పాఠశాలల్లో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బలిజిపేట మండలంలోని గంగాడ, గలావల్లి ప్రాథమిక పాఠశాలల్లో వైద్యశాఖ సిబ్బంది విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు వైద్యశాఖ సిబ్బంది పాఠశాలలో విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించి వాటి ఫలితాలను వైద్యశాఖకు పంపించనున్నామని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో రక్తం తక్కువగా ఉండే విద్యార్థులకు అవసరమైన వైద్యసేవలు అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నాయని చెప్పారు. కార్యక్రమంలో వైద్యశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక అలంకరణ



భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహ స్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నది ఒడ్డున వేంచేసిన వేణుగోపాలస్వామి ఆలయప్రాంగణంలో వెలసిన లక్ష్మీనృసింహ స్వామి ప్రత్యేక పుష్ప,పత్రాల ఆలంకరణలో భక్తులకు గురువారం దర్శనమిచ్చారు. గురువారం స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడం వల్ల ఆలయ అర్చకులు స్వామివారిని అలంకరించారు. ఆలయఅర్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో భక్తులందరూ వేకువ జామునుంచి పూజలు నిర్వహించారు. అలాగే స్వామివారికి మరికొంత మంది భక్తులు క్షీరాభిషేకాలు,కుంకుమపూజలు,ఆలయ ప్రదక్షిణ చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు దూరప్రాంతాల నుంచి ఉపవాసాలతో వచ్చిన భక్తులకు పూజలనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

సమస్యలు పట్టవా!

సీతంపేట: మండలంలోని సమస్యలను అధికారులు పట్టించుకోరా అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు ప్రశ్నించారు. సీఐటీయూ కార్యాలయంలో ఆ పార్టీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంపై మండల అభివృద్ధి అధికారి పర్యవేక్షణ కరువైందన్నారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు సగం కూడా నిర్మాణం జరగలేదన్నారు. నిర్మాణం పూర్తయిన వాటిని కూడా ప్రారంభించలేని పరిస్థితి ఉందన్నారు. జనరల్ బాడీలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సైతం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న జలజీవన్, రోడ్డు పనులు దృష్టి సారించడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు భాస్కరరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు



వీఆర్‌ఓల నుంచి ఇళ్ల స్థలాల వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

వీరఘట్టం: అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇళ్ల స్థలాలు అందజేస్తామని తహసీల్దార్ చందక సత్యనారాయణ అన్నారు. రెండవ విడత పంపిణీ చేయనున్న ఇళ్ల స్థలాల లబ్ధిదారుల వివరాలను గురువారం ఆయన వీఆర్‌ఓల నుంచి సేకరించారు. వీరఘట్టం మేజరు పంచాయతీకి సంబంధించి రెండవ విడతలో లబ్ధిదారులకు మరియగిరి సమీపంలో ఇళ్లు ఇచ్చేందుకు ప్రతిపాదనలు చేశామన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే మరియగిరి సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని చదును చేసి అర్హులైన పేదలకు అప్పగిస్తామన్నారు.

వైద్య సేవలు పొందాలి

పాలకొండ రూరల్: దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న బాధితులకు ప్రభుత్వ ఆస్పత్రి ద్వారా అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ జి.నాగభూషణరావు అన్నారు. ఏరియా ఆస్పత్రి పరిధిలో హెచ్‌ఐవీ జీవిస్తున్న 195 మందికి వైరల్ లోడ్ పరీక్షలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదిలో ఒకసారి ఈ తరహా పరీక్షలు చేయడం ద్వారా బాధితుని తాజా ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోవడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో ఆరోగ్యం మెరుగు పడేందుకు అవసరమైన మందులు, జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

ఓటే సామాన్యుడి ఆయుధం

- జాయింట్ కలెక్టర్ గోవిందరావు



పార్వతీపురం: ఉత్తమ సేలనందించిన ఆర్‌ఐ రామకృష్ణకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న జేసీ గోవిందరావు

పార్వతీపురం: ఓటే సామాన్యుడి ఆయుధమని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన 14వ జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా పార్వతీపురం రెవెన్యూ డివిజనల్ అధికారి కె. హేమలత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తప్పనిసరిగా నమోదు కావాలని సూచించారు. తమ ఓటు హక్కు గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి భారతీయుడి హక్కు అని పేర్కొన్నారు. మంచి సుపరిపాలన అందించే నాయకుడిని ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నుకోవడానికి ఓటు ఒక ఆయుధమని తెలిపారు. డిప్యూటీ కలెక్టర్ జి.కేశవ నాయుడు మాట్లాడుతూ ఓటు వినియోగంలో ఎలాంటి ప్రలోభాలకులోను కాకూడదని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావు మాట్లాడుతూ ఇంకా ఓటరుగా నమోదు చేసుకోని వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన చిత్రలేఖనం పోటీలలో ప్రతిభ చూపించిన విద్యార్థులకు జాయింట్ కలెక్టర్ బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా తయారీలో విశేష సేవలు అందించిన బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు, సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, జిల్లా వృత్తివిద్యాశాఖాధికారి మంజుల వీణ, తహసీల్దార్ ఎస్.శివన్నారాయణ, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.



సీతానగరం: మాట్లాడుతున్న జీజే కాలేజీ ప్రిన్సిపాల్ డీజీఎస్‌వీ త్రినాథ్



బలిజిపేట: పలగర ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు

సీతానగరంలో..

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాలు గురువారం జరిగాయి. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎన్వీ రమణ ఆధ్వర్యంలో కొత్త ఓటర్లతో ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు ప్రసాద్, డి రామకృష్ణ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డీజీఎస్వీ త్రినాథ్, ఆర్ఐ ఎన్ శ్రీనివాసరావు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రతిజ్ఞ

బలిజిపేట: మండలంలోని పాఠశాలల్లో జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులకు ఓటు ప్రాధాన్యం గురించి ఉపాధ్యాయులు తెలియజేశారు. ఓటు హక్కు ఎన్ని సంవత్సరాలకు వస్తుంది, దానిని ఏవిధంగా వినియోగించాలి, ఓటువేసేముందు ఆలోచించి ఓటువేయాలని చెబుతూ ఓటు హక్కు ప్రాధాన్యాన్ని వివరించారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఎందుకు జరుపుకుంటారో తెలియజేసి విద్యార్థులచేత ప్రతిజ్ఞ చేయించారు.

ఓటే వజ్రాయుధం



ఓటర్లను సన్మానిస్తున్న అధికారులు

సాలూరు: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని తహసీల్దార్ బాలమురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ జయరామ్ అన్నారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే సీనియర్ ఓటర్లతో పాటు కొత్తగా ఓటుహక్కు పొందిన వారిని సన్మానించారు. అంతకుముందు మున్సిపల్ కార్యాలయం నుంచి వైఎస్సార్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, మానవ హారంగా ఏర్పడ్డారు.

శరవేగంగా కొదమ రోడ్డు పనులు



భూమిపూజ చేస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, కలెక్టర్ నిశాంత్‌కుమార్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు (ఫైల్)

సాలూరు: గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర కృషితో కొదమ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అలాగే ఇతర గిరిశిఖర గ్రామాల్లో కూడా రహదారుల పనులు జోరుగా సాగుతున్నాయి. ఇదిలా ఉంటే కొదమ రోడ్డుకు ఓ ప్రత్యేకత ఉంది. గతంలో గ్రామానికి చెందిన గిరిజనులు స్వచ్ఛందంగా కొంతమేర రోడ్డు నిర్మాణం చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న ప్రముఖ సినీనటుడు సోనూసూద్ వారిని అభినందించారు. గ్రామానికి తాను వస్తానని సామాజిక మాధ్యమాల ద్వారా తెలిపారు. అయితే గిరిజనులు సగం రోడ్డు వేసుకున్నా అప్పటి ప్రభుత్వం స్పందించలేదు. దీంతో విషయం తెలుసుకున్న మంత్రి పీడిక రాజన్నదొర నంద-పగులుచెన్నేరు రోడ్డు నుంచి కొదమకు సుమారు 11 కోట్ల 36 లక్షల 56 వేల రుపాయలతో బీటీ రోడ్డు మంజూరు చేయించారు. 33 కల్వర్టులతో కూడిన 10.8 కిలోమీటర్ల రోడ్డుకు 2022 ఆగస్టు 26న భూమిపూజ చేశారు. ఈ రోడ్డు నిర్మాణం వల్ల కొదమ పంచాయతీలో గల చినచోర, పెదచోర, చింతామల, కొదమ, తదితర గిరిశిఖర గ్రామాల ప్రజల రాకపోకలకు వీలుకలుగుతుంది. అటవీశాఖ అనుమతులు తీసుకువచ్చి మరీ పనులు జోరందుకునేలా చేస్తున్న మంత్రి రాజన్నదొరకు గిరిజనులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



చురుగ్గా జరుగుతున్న కొదమ రోడ్డు పనులు


సారా ప్యాకెట్లు స్వాధీనం

సాలూరు: ఆటోలో తరలిస్తున్న సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై వెంకటరమణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ, ముందస్తు సమాచారం మేరకు చంద్రంపేట జంక్షన్ వద్ద బుధవారం రాత్రి వాహన తనిఖీలు చేపడుతుండగా.. పురోహితునివలస గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్, తేజేశ్వరరావు ఆటోలో వెయ్యి సారా ప్యాకెట్లు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఆటోను సీజ్ చేయడంతో పాటు సారాను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

'రిపబ్లిక్ వేడుకలు ఘనంగా జరుపుకుందాం'

మక్కువ: గణతంత్ర దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకుందామని ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 8 గంటలకు జరుపుకోనున్న గణతంత్ర వేడుకలకు ఎంపీపీ మర్రి పారమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు హాజరుకానున్నారని పేర్కొన్నారు. వేడుకలకు మండలస్థాయి అధికారులంతా హాజరు కావాలని కోరారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...



ఆడుదాం.. ఆంధ్రా పోటీల్లో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

కురుపాం: ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీలు నియోజకవర్గ స్థాయిలో ఉల్లాసంగా.. ఉత్సాహంగా జరుగుతున్నాయి. కురుపాం నియోజకవర్గ పరిధిలో ఉన్న ఐదు మండలాలకు చెందిన క్రీడాకారులు గురువారం జరిగిన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ తదితర పోటీలు జరిగాయి. వివిధ మండలాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

పాలకొండ రూరల్: స్థానిక అగ్నిమాపక కేంద్రం మలుపు వద్ద చెరుకు లోడుతో పట్టణంలోకి వస్తున్న లారీ అదుపు తప్పి పక్కనే ఉన్న చిరు వ్యాపారుల బళ్లపై ఒరిగిపోయింది. ఈ సమయంలో వ్యాపారు లు అక్కడ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. మలుపు వద్ద వాహనం ఒరిగిపోవటం, చెరకు రోడ్డుపై పడటంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేయడంతో పాటు సహాయక చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించినట్టు ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



కొండాపురంలో ఆర్‌బీకే ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వం ప్రజల వద్దకే ప్రభుత్వసేవలు అందిస్తుందని ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని కొండాపురం గ్రామంలో రూ.50లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, సచివాలయ భవనాలను వారు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ భవనాలు అందుబాటులోనకి తీసుకురావడం ద్వారా ప్రజలు మండల కేంద్రాల చుట్టూ తిరగకుండా సేవలు అందిస్తున్నారని తెలిపారు. సచివాలయ వ్యవస్థతో నేరుగా ప్రజల వద్దనే అధికారులు ఉంటున్నారని వివరించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పంటల కొనుగోలు, తదితర సేవలు అందుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.భాను, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాషరావు, వాకముడి అనిల్‌కుమార్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రణస్థలం రాంబాబు, సభ్యులు శాసుబిల్లి జనార్దనరావు, గ్రామ సర్పంచ్ రాయి వనజ, ఎంపీటీసీ కరణం అమరజ్యోతి, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొబైల్ బుక్‌స్టోర్ ప్రారంభం



బుక్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న సీఐ

పాలకొండ: విశాలాంధ్ర మొబైల్ బుక్ స్టోర్‌ను పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా సీఐ ఎం.చంద్రమౌళి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా మంచి విజ్ఞానం పొందగలమని తెలిపారు. అత్యంత విలువైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు వెలమల మన్మధరావు, కౌన్సిలర్లు కడగల రమణ, బాసూరు కాంతారావు, కిల్లారి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు

భామిని: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పిస్తామని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి అన్నారు. మండలంలోని సింగిడి, బురుజోల పోలింగ్ కేంద్రాలను గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలని సూచించారు. సింగిడి పోలింగ్ కేంద్రం వద్ద వెంటనే మరుగుదొడ్డి నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ నీలాపు అప్పారావు, ఏఈలు జి.గౌరీశంకర్, అలికాన సందీప్, సర్పంచ్ మడపాన కేశవ, బీఎల్‌ఓలు ఉన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం



సచివాలయం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం పల్లెలను ప్రగతిపథంలో నడిపించడానికి, ప్రజల సమస్యలు క్షేత్రస్థాయిలో పరిష్కరించడానికి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన సీతానగరం మండలంలోని ఆర్.వెంకటంపేట గ్రామంలో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకుపాలన స్థానికంగా అందించాలనే సంకల్పంతో సచివాలయ వ్యవస్థ తెచ్చిఒక్కో సచివాలయానికి 14 మంది వంతున సర్వీస్ కమిషన్ విధానం ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ఇప్పటికే ఆర్ వెంకంపేటలో వెల్‌నెస్‌సెంటర్, రైతు భరోసా కేంద్రం భవనాన్ని ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. అలాగే సచివాలయం పరిధిలో ప్రజలకు ఇళ్లవద్దనే సేవలందించడానికి వలంటీర్ వ్యవస్థ తెచ్చి గ్రామాల్లో యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. ప్రజావసరాలకు అనుగుణంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలియజేశారు. సంక్షేమ పథకాలు అమలు చేసిన సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నుకోవలసిన అవసరం ఆసన్నమైందన్నారు. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించడానికి సంక్షేమ పథకాలు పొందిన వారంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, సర్పంచ్ పెంట శ్రీదేవి, పి.శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పెంట అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పి.సత్యనారాయణ, అంబటి కృష్ణంనాయుడు, రామకృష్ణ, ఈశ్వరనారాయణ, ఇంజినీరింగ్ అధికారులు, గ్రామవలంటీర్లు, పీఏసీఎస్ సీఈఓ రామకృష్ణ పాల్గొన్నారు.

కృష్ణపల్లిలో ఆర్‌బీకే ప్రారంభం

పార్వతీపురం టౌన్: రైతన్నలకు ఆపద్బాంధవులుగా ఆర్‌బీకేలు పనిచేస్తున్నాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన పార్వతీపురం మండలంలోని కృష్ణపల్లిలో ఆర్‌బీకేను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, పీఏసీఎస్ సీఈఓ జనార్దన, వైస్ ఎంపీపీ సిద్దా జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా సెక్రటరీ వి. గురురాజు, పార్టీ నాయకులు చంద్రశేఖర్, బలగ నాగేశ్వరరావు, పెంట రమణ, ఎంపీటీసీ బడే రామారావు, రాగాల సోమశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సమావేశాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: ఈనెల 27న విశాఖపట్నం భీమిలిలో సీఎం జగన్ మోహన్ రెడ్డి ఉత్తరాంధ్ర వైఎస్సార్‌సీపీ శ్రేణులతో నిర్వహించనున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పురపాలక సంఘం ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో విస్తృతస్థాయి సన్నద్ధత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సీఎం జగన్ మోహన్ రెడ్డి 175/175 స్థానాలు గెలుపే లక్ష్యంగా వెళ్తున్నారని, అందులో భాగంగా ఉత్తరాంధ్ర నుంచే ఎన్నికల శంఖారావం పూరించనున్నారని చెప్పారు. ఈ సమావేశానికి భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు. పురపాలక సంఘం పరిధిలో గల 37పోలింగ్ బూత్‌ల స్థాయిలో 20 మంది సభ్యుల చొప్పున బూత్ కమిటీలు ఏర్పాటు చేసి త్వరితగతిన జాబితాను అందజేయాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఏఎంసీ వైస్‌చైర్మన్ వానపల్లి శంకరరావు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, వార్డు కౌన్సిలర్లు, వార్డు సచివాలయ కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లకు విద్యుత్ సౌకర్యం



టిడ్కో ఇళ్లకు విద్యుద్దీకరణ పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

సాలూరు: ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక కృషితో టిడ్కో ఇళ్లకు విద్యుద్దీకరణ పనులు ప్రారంభించినట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు. పట్టణంలోని గుమడాం సమీపంలో గల టిడ్కో ఇళ్లకు విద్యుద్దీకరణ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, తదితరులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఫిబ్రవరి మెదటి వారంలో ఈ గృహాలను లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ఈ క్రమంలో మౌలిక వసతుల పనులు త్వరితిగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జయరామ్, టిడ్కో ఈఈ జ్యోతి, విద్యుత్‌శాఖ డీఈ త్రినాథరావు, ఏడీఓ రంగారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు జర్జాపు ఈశ్వరరావు, జేకేసీ కన్వీనర్ గిరి రఘు, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పాండు రంగారావు

కురుపాం: వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేసి పదవీ విరమణ పొందిన పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెన్షనర్లు గురువారం నిరసన చేపట్టారు . ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు టి.పాండురంగారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీల ప్రకారం పెన్షనర్లకు ఆదుకోవాలన్నారు. 11వ పీఆర్‌సీ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని, హెల్త్ కార్డు ద్వారా అన్ని వ్యాధులకు అన్ని గుర్తింపు పొందిన ఆసుపత్రిల్లో వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని పెన్షనర్లు అందించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన పెన్షనర్లు పాల్గొన్నారు.